## క్లుప్తంగా

### ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు



ఎర్నిమాంబకు హారతి ఇస్తున్న భక్తులు

**కంచరపాలెం:** కాన్వెంటు కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్ బాబా నేతృత్వంలో అర్చకులు పులఖండం శ్రీకాంత్ శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు నిర్వహించారు. పూజారి వాసుపల్లి విజయమ్మ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ.10, రూ. 50 ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ సిబ్బంది, ట్రస్టు సభ్యులు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు.

### సీతంపేటలో చలివేంద్రం ఏర్పాటు



మజ్జిగ అందిస్తున్న కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్

**సీతంపేట:** శ్రీయశోదకృష్ణ సేవా సంఘం ఆధ్వర్యంలో 25వ వార్డు సీతంపేట కూడలిలో దుర్గా గణపతి ఆలయం వద్ద ఆదివారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. దీనిని ముఖ్య అతిథి కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ప్రారంభించి మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో నమ్మి రవికుమార్, నొడగల కృష్ణ, శ్రీకృష్ణ యువజన సేవా సంఘం, యశోదకృష్ణ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

### ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం



బీజేపీ జెండా ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

**సీతమ్మధార:** బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం ఉత్తర నియోజకవర్గ కార్యాలయ ఆవరణలో పార్టీ జెండాను ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవినీతిని రూపుమాపేందుకే బీజేపీ ఆవిర్భవించిందని తెలిపారు. అనంతరం స్వీట్లు పంచారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరశురాంరాజు, నార్త్ కన్వీనర్ సురేష్‌బాబు, పృథ్వీరాజ్ కె.శంకరరావు, మండల అధ్యక్షులు, వార్డు అధ్యక్షులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

### పాదచారులకు సోడాల పంపిణీ



సోడా అందిస్తున్న ప్రణవ్ గోపాల్

**సీతమ్మధార:** శ్రీరామ నవమి సందర్భంగా ఆదివారం 24వ వార్డు నక్కవానిపాలెంలో లక్కీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బండారు గుప్తాజీ నేతృత్వంలో సోడాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథి వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ పాదచారులకు గోలి సోడాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో సోడాలు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. రాజేష్‌రెడ్డి, హేమ, పైడిరాజు, శ్రీను, చిన్న, మురళి తదితరులు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

**కూర్మన్నపాలెం:** అగనంపూడిలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాలు.. పార్మాకాలనీకి చెందిన నమ్మి అచ్చెయ్యమ్మ (64) పనిమీద డెంకాడ కాలనీకి వెళ్తూ జాతీయ రహదారి దాటుతుండగా బొలెరో వాహనం ఢీకొంది. దీంతో ఆమె కింద పడిపోవడంతో బలంగా గాయపడింది. స్థానికులు ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలికి భర్త రాములు, కుమారుడు అప్పలనాయుడు ఉన్నారు. కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి బొలెరో డ్రైవర్ సాయిబాబును అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్టు సీఐ మల్లేశ్వరరావు తెలిపారు.



నేలపైనే కూరగాయలు విక్రయిస్తున్న రైతులు



స్టాళ్ల వద్ద వినియోగదారుల రద్దీ

# రైతు బేజార్

## సమస్యలతో సీతమ్మధార రైతుబజారు సతమతం



సీతమ్మధార రైతుబజార్

- స్టాళ్ల కొరతతో ఇబ్బందులు
- నేలమీద వ్యాపారాలు చేస్తున్న రైతులు
- ఇరుగ్గా మారుతున్న బజారులో రాకపోకలకు అవస్థలు

**సీతమ్మధార:** సీతమ్మధార రైతుబజార్‌లో స్టాళ్ల విస్తరణకు మోక్షం కలగడం లేదు. ఇక్కడ 1999తో రైతు బజార్ నిర్మించారు. ఉదయం 120 మంది, సాయంత్రం 80 మంది రైతులు కూరగాయలు విక్రయిస్తారు. బజారులో మొత్తం 150 స్టాళ్లు ఉండగా, 311 మంది వరకు రైతులు పేర్లు నమోదు చేసుకున్నారు. రోజుకి 200 మంది రైతులు వస్తున్నారు. ప్రతి రోజూ ఈ బజారులో సగటున 700 క్వింటాళ్ల కూరగాయలు విక్రయిస్తారు. ఈ బజార్‌కి సీతమ్మధార, కేఆర్‌ఎం కాలనీ, గాంధీనగర్, పీ అండ్ టీ కాలనీ, బాలయ్యశాస్త్రి లేఅవుట్, రాధాకృష్ణ లేఅవుట్, మద్దిలపాలెం, భానునగర్, హెచ్‌బీ కాలనీ, ఎంఎంటీసీ కాలనీ, పాత వెంకోజీపాలెం, పాత, కొత్త రేసపువానిపాలెం, సత్యం జంక్షన్, నక్కవానిపాలెం, గురుద్వారా, శాంతినగర్, సీతమ్మపేట తదితర ప్రాంతాలకు చెందిన వేలాది మంది ప్రజలు కూరగాయల కొనుగోలు నిమిత్తం వస్తుంటారు. అయితే రైతులకు సరిపడినన్ని స్టాళ్లు లేక నేలపైనే వ్యాపారాలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. బజారులో కె.కోటపాడు, ఆనందపురం, సంతపాలెం, నర్సీపట్నం, అరకు, అల్లూరి జిల్లాలో గల పలు మండలాలకు చెందిన రైతులు కూరగాయలు విక్రయిస్తారు.

**స్టాళ్ల కొరతతో ఇక్కట్లు..**

గతంలో అదనపు స్టాళ్లు నిర్మించే మార్కెటింగ్ శాఖ కొన్నాళ్లుగా ఆ ఊసే మరిచిపోయిందంటే అతిశయోక్తి కాదు. ఇదిలా ఉండగా 2023లో ఇక్కడ ఆర్గానిక్ స్టాల్ నిమిత్తం 12 స్టాళ్లు కోల్పోవలసి వచ్చిందని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. పాత ఈవో కార్యాలయం ఆయిల్ మిల్లుకి కేటాయించడం గమనార్హం. గత రెండు నెలలుగా ఈ గది వృథాగా పడి ఉంది. బజారులో వాణిజ్య స్టాళ్లు 21 వరకు ఉన్నాయి. ఇంకా పువ్వులు, పండ్లు, ఆకు కూరలు, కొబ్బరికాయల స్టాళ్లు 25 వరకు ఉన్నాయి. స్టాళ్లు లేక టాయ్‌లెట్ల సమీపంలోను, ప్రవేశమార్గాల వద్ద కూడా నేలపైనే కూరగాయలు అమ్ముకోవాల్సి వస్తుందని రైతులు విచారం వ్యక్తం చేస్తున్నారు. నెలకు సుమారు రూ.5 లక్షల వరకు అద్దెల రూపంలో వస్తున్నా సదుపాయాల కల్పనపై అధికారులు దృష్టి సారించడం లేదని అంటున్నారు.

**పార్కింగ్‌కే తిప్పలే..**

ఇక్కడ పార్కింగ్ సదుపాయం లేకపోవడంతో బజారుకి రెండు వైపులా రోడ్డుమీదే వాహనాలు పార్కింగ్ చేయాల్సిన పరిస్థితి నెలకొంది. బజారు బయట ఒకవైపు తోపుడు బండ్లు, మరోవైపు వాహనాల పార్కింగ్ వల్ల ట్రాఫిక్ జామ్ అవుతున్నా ఎలాంటి చర్యలు లేవు. బజారు లోపలికి వెళ్లేందుకు గల రెండు ప్రవేశ ద్వారాలకు అడ్డంగా నేల దుకాణాలు, వాహనాల పార్కింగ్ ఆటంకంగా మారడంతో వినియోగదారుల రాకపోకలకు అవస్థలు పడాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తమవుతోంది.

**అదనపు స్టాళ్లు లేక ఇబ్బందులు..**

సీతమ్మధార రైతుబజార్‌లో సరిపడినన్ని స్టాళ్లు లేక వ్యాపారులు నేలబారు వ్యాపారం చేస్తున్నారు. దీనివల్ల రైతుబజార్ ఇరుగ్గా మారింది. రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. అధికారులు సరిపడినన్ని స్టాళ్లు ఏర్పాటు చేస్తే వ్యాపారులకు వెసులుబాటుగా ఉంటుంది.

– శ్రీనివాసరావు, సీతమ్మధార.

**నేలమీదే వ్యాపారాలు..**

సీతమ్మధార రైతుబజార్‌లో కొందరు వ్యాపారులు స్టాళ్లు లేక నేలమీదే వ్యాపారాలు చేసుకుంటున్నారు. ఆ సమస్యను అధికారులు పరిష్కరించాలి. అలాగే బజారు బయట నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఆ సమస్యను కూడా పరిష్కరిస్తే వ్యాపారులు, వినియోగదారులకు సులువుగా ఉంటుంది.

– కామేశ్వరరావు, బాలయ్యశాస్త్రి లేఅవుట్

## ‘సామాజిక నిత్య హితోక్తులు’ పుస్తకావిష్కరణ

**సీతంపేట:** కళావేదిక వ్యవస్థాపకుడు డాక్టర్ నండూరి రామకృష్ణ రచించిన సామాజిక నిత్య హితోక్తులు 3వ వచన సంపుటి ఆవిష్కరణ సభ ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగింది. కళావేదిక కల్చరల్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజానికి మేలు చేసే హితోక్తులు రచించిన నండూరిని అభినందించారు. విశ్రాంత తెలుగు అధ్యాపకులు ఎం.సుబ్బారావు పుస్తక సమీక్ష చేశారు. కార్యక్రమంలో జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్–1 అధ్యక్షుడు జి.తనూజరెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ గంట్ల శ్రీనుబాబు, కళావేదిక వ్యవస్థాపకుడు నండూరి రామకృష్ణ, సంస్థ గౌరవాధ్యక్షులు కమల్ బైద్, ప్రధాన కార్యదర్శి బి.రజని, కార్యదర్శి అరుణం శ్రీనివాస్ పాల్గొన్నారు.



సామాజిక నిత్య హితోక్తులు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి

**‘ఇవటూరి’ పుస్తకాల ఆవిష్కరణ**

ప్రముఖ కవి ఇవటూరి గౌరీశం రచించిన శివ భావ నాలహరి, శివ కథా సుధలు, శ్రీరామ పద్య మణిమంజరి పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించారు. సి.ఎస్.రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి ఆచార్య వి.బాలమోహన్‌దాస్ పుస్తకాలను ఆవిష్కరించారు. డాక్టర్ డి.వి.సూర్యారావు, సిహెచ్.చిన సూర్యనారాయణ పుస్తక సమీక్ష చేశారు.

## రౌడీయిజం చేస్తే కఠిన చర్యలు



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ద్వారకా సీఐ రమణ



రౌడీషీటర్లకు సూచనలిస్తున్న ఫోర్త్‌టౌన్ సీఐ సత్యనారాయణ

**సీతమ్మధార:** అల్లర్లు సృష్టించినా, రౌడీయిజం చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని ద్వారకా సీఐ డి.వి.రమణ హెచ్చరించారు. ద్వారకా పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించి, వేలి ముద్రలతోపాటు సంతకాలు సేకరించారు. ఎవరు ఏ కేసుల్లో ఉన్నారని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు మద్యం షాపుల వద్ద తాగి గొడవలు చేస్తే చర్యలు ఊరుకునేది లేదన్నారు. రౌడీషీటర్లందరూ మంచిగా ఉండాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా కుటుంబాలతో కలిసి హాయిగా జీవించాలని సూచించారు. పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని గుర్తించుకుని, సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. హాజరు కాని రౌడీషీటర్‌కు ఫోన్‌లో మాట్లాడి కౌన్సెలింగ్ చేశారు. ప్రతి ఆదివారం స్టేషన్‌కు తప్పనిసరిగా రావాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

**మంచిగా జీవించండి**

ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీషీటర్లకు సీఐ సత్యనారాయణ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఎలాంటి అల్లర్లు చేయకుండా ఉండాలన్నారు. తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా కుటుంబాలతో కలిసి మంచిగా జీవించాలని సూచించారు. నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రౌడీషీటర్ల దినచర్యపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఎస్‌ఐ వెంకటరావు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఉక్కు దీక్షలకు భెల్ సీఐటీయూ మద్దతు



నినాదాలు చేస్తున్న యూనియన్ నాయకులు

**అక్కిరెడ్డిపాలెం:** జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన1469వ రోజు రిలే నిరాహార దీక్షా శిబిరంలో ఆదివారం పబ్లిక్ సెక్టార్ యూనియన్ భెల్ ప్రతినిధులు, భెల్ సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు. సీటూ ప్రధాన కార్యదర్శి జి.టి.పి.ప్రకాష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ విషయంలో స్పష్టమైన వైఖరి వెల్లడించడం లేదన్నారు. ఇక్కడ ఉన్న ఉద్యోగులను వీఆర్‌ఎస్ పేరుతో ఇంటికి పంపించేసి, కాంట్రాక్ట్ కార్మికులను తొలగించి కంపెనీను ప్రైవేటీ కరణ చేయడానికి ఆలోచిస్తుందని ఆరోపించారు. పోరాటంతోనే స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకోవాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్.జగన్నాథరావు, అప్పలనారాయణ, హెచ్.భోగేష్, కె.పవన్‌కుమార్, సీహెచ్.నారాయణ, నారపురెడ్డి, ఎస్.అప్పారావు, విశ్రాంత ప్రొఫెసర్ సూరప్పడు తదితరులు పాల్గొన్నారు.

## అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం

**సింహాచలం:** శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి నగరంలోని ఎంవీపీ కాలనీకి చెందిన దంతులూరి భాస్కరరాజు రూ.లక్ష 116 విరాళాన్ని నగదు రూపంలో అందించారు. దేవస్థానం తరఫున ప్రొటోకాల్ సూపరింటెండెంట్ దాతకు బాండ్ అందజేశారు. స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రంని అధికారులు అందించారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ వరహానరసింహం తదితరులు పాల్గొన్నారు.

## వాకర్స్ పార్కు అభివృద్ధికి సహకారం

**మురళీనగర్:** మురళీనగర్ వాకర్స్ క్లబ్ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని జీవీఎంసీ జోన్–5 కమిషనర్ బొడ్డేపల్లి రాము తెలిపారు. మురళీనగర్ వాకర్స్ పార్కులో ఆదివారం వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు సనపల భానుప్రకాష్ అధ్యక్షతన నిర్వహించిన నెలవారీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. వాకర్స్ క్లబ్ సభ్యులు క్రమశిక్షణ, సేవా భావానికి మారుపేరుగా నిలుస్తున్నారని ప్రశంసించారు. పార్కులో ప్రస్తుతం ఉన్న ఔషధ మొక్కలకు అదనంగా కొత్త మొక్కలు పెంచాలని సూచించారు. వేసవిలో నీటిని వృథా చేయకుండా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి చర్యలు తీసుకున్నామని చెప్పారు. పార్కులోని గ్రంథాలయాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా వాకర్స్ వాయిస్ పత్రికను జెడ్సీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో పూర్వ అధ్యక్షుడు ఎన్.బుచ్చయ్య, అధ్యక్షుడు ఎస్.భానుప్రకాష్, కార్యదర్శి సిహెచ్.ప్రసాదరావు, ఉపాధ్యక్షురాలు జి.విజయలక్ష్మి, సంయుక్త కార్యదర్శి ఎన్.ప్రకాశరావు, జాలీ వాకర్ ఎస్.మాధవి ఇతర సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జోన్–5 కమిషనర్ రాము

# అంతా రామమయం

- వాడవాడలా సీతారాముల కల్యాణం
- ఆలయాలకు శ్రీరామ నవమి శోభ



సుందర అభయాంజనేయస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణం వీక్షిస్తున్న భక్తులు



శ్రీలలితాపీఠంలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

**సీతంపేట:** శ్రీరామ నవమి సందర్భంగా నియోజకవర్గంలో వాడవాడలా సీతారాముల కల్యాణ మహోత్సవం కనుల పండువగా జరిపించారు. రామాలయాలు, ఆంజనేయ, షిర్డీసాయి ఆలయాలు, అపార్టుమెంట్లు, కాలనీల్లో రామయ్య కల్యాణం వైభవంగా జరిగింది.

**శ్రీలలితాపీఠంలో..**

అక్కయ్యపాలెం లలితాపీఠంలో సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. పీఠంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణ సేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

**సీతంపేటలో..**

స్థానిక గణేష్‌నగర్‌లోని పార్వతీశ్వరాలయంలో సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. సీతారాముల పంచలోహ ఉత్సవమూర్తులకు అర్చకులు గంగవరపు శివాజీశర్మ, భాస్కర శర్మ సీతారాముల కల్యాణం జరిపించారు. సాయంత్రం సీతారాముల ఉత్సవ మూర్తులను మేళతాళాలతో పురవీధుల్లో ఊరేగించారు.

**అక్కయ్యపాలెంలో....**

అక్కయ్యపాలెం 80 అడుగుల రోడ్‌లో లారీ యజమానుల సంఘం ప్రతినిధి గారపాటి సతీష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పానకం, వడపప్పు, ప్రసాదం పంపిణీలో వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, స్థానిక ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుతో కలిసి భక్తులకు ప్రసాదం పంచిపెట్టారు.

**భక్తిశ్రద్ధలతో శ్రీరామనవమి..**

**సీతమ్మధార:** సీతమ్మధార క్షత్రియ కల్యాణ మండపంలో క్షత్రియ సంక్షేమ సమితి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, సిరి వెంకటేశ్వర డెవలపర్స్ మేనేజింగ్ డైరెక్టర్ కె.కె. రాజు దంపతులు, యూవీఎస్ శివకుమార్ దంపతులు సీతారాముల కల్యాణం ఘనంగా జరిపించారు. క్షత్రియ సంక్షేమ సమితి అధ్యక్షుడు డి. తిరుపతి రాజు, కార్యదర్శి ఆర్‌వీ గణపతిరాజు, సమితి సభ్యులు పాల్గొన్నారు.

**కల్యాణం.. కమనీయం**

జీవీఎంసీ 14వ వార్డు గణేష్‌నగర్‌లోని త్రిముఖ విఘ్నేశ్వర పంచాయతన దేవాలయంలో శ్రీరామునికి అభిషేకం, సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులకు తలంబ్రాలు అందజేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు టి.ఎస్.ఎన్.మూర్తి, ఆలయ కార్యదర్శి ప్రకాశరావు, గొర్లె కృష్ణ, టి.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు. 24వ వార్డు నక్కవానిపాలెంలోని రామాలయంలో గ్రామ కమిటీ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు.

**కాంచిన కనులే కనులట..**

**మురళీనగర్:** స్థానిక రామాలయంలో ఆలయ నిర్వహణ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు టి.నారాయణ రెడ్డి, సనపల వరప్రసాద్ పర్యవేక్షణలో ఉదయం 6.30 గంటలకు విష్ణు సహస్ర నామార్చనతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకుడు గొడవర్తి రఘురామాచార్యులు ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు.

**వైభవంగా సీతారాముల కళ్యాణం..**

కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు శేషాచార్యులు, వాసుదేవాచార్యులు ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం నిర్వహించారు. ఈవో బి.ప్రసాద్ దంపతులు పాల్గొన్నారు.

- పట్టాభిరెడ్డితోట దాసాంజనేయస్వామి ఆలయంలో అర్చకుడు ఆరవిల్లి సీతారామాచార్యులు ఆధర్యంలో సీతారాముల కల్యాణం జరిపించారు. ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు, మాజీ ఎమ్మెల్సీ మాధవ్, జనసేన నాయకురాలు ఉషాకిరణ్, ఆలయ ధర్మకర్త నారాయణరావు పాల్గొన్నారు.
- పట్టాభిరెడ్డితోటలోని వానప్రస్థ వృద్ధాశ్రమంలో ఆర్‌బీఎల్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రొబ్బి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం నిర్వహించారు. వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా నాయకుడు చిరికి శ్రీనివాసరావు సీతారాములను దర్శించుకున్నారు.

**రాములోరి కల్యాణ వైభోగం**

**మర్రిపాలెం:** జీవీఎంసీ 51వ వార్డు గాంధీనగర్–2 హరిహర క్షేత్రంలో కొలువై ఉన్న భద్రాద్రి సీతారామచంద్ర స్వామి ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు, వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ స్వామివారిని దర్శించుకున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బి.తిరుమలరావు, మెట్ట దమయంతి, శ్యామ్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

**సుందర అభయాంజనేయ ఆలయంలో..**

**తాటిచెట్లపాలెం:** స్థానిక సుందర అభయాంజనేయ స్వామి ఆలయంలో ఆలయ ధర్మకర్తలు సీతారామారావు, జయలక్ష్మి దంపతుల చేతుల మీదుగా సీతారాముల కల్యాణం నిర్వహించారు. ఆలయ అధ్యక్షుడు ఆళ్ల నరసింగరావు, కోశాధికారి ఎల్లపు రామ అప్పారావు, కమిటీ సభ్యులు అల్లాడి అప్పలరాజు, మాత ఈశ్వర్రావు, దాసు, శ్రీరాములు, భక్తులు పాల్గొన్నారు.



వానప్రస్థలో సీతారాములకు కల్యాణ మాలలు సమర్పిస్తున్న రొబ్బి శ్రీనివాసరావు దంపతులు



క్షత్రియ కల్యాణ మండపంలో సీతారాముల కల్యాణంలో పాల్గొన్న కె.కె. రాజు దంపతులు



గాంధీనగర్–2 హరిహరక్షేత్రంలో అన్నప్రసాదం వడ్డిస్తున్న రెయ్యి వెంకటరమణ తదితరులు



సీతంపేట పార్వతీశ్వరాలయంలో సీతారాములు



అక్కయ్యపాలెంలో ప్రసాదం పంపిణీ చేస్తున్న ప్రణవ్‌గోపాల్, ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు



గణేష్‌నగర్ దేవాలయంలో సీతారాముల కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు



మురళీనగర్ రామాలయంలో పూజలందుకున్న సీతారాములు



సుందర అభయాంజనేయస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణంలో పాల్గొన్న సీతారామారావు, జయలక్ష్మి దంపతులు

### అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు

**సింహాచలం:** శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణపుష్పార్చన ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. 108 స్వర్ణసంపెంగలతో అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

**వైభవంగా నిత్యకల్యాణం**

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్య కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కొలువుంచి, ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని జరిపారు.

### మే 20న జాతీయ సమ్మె

సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు

**ఉక్కునగరం:** కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా.. లేబర్ కోడ్‌లు రద్దు చేయాలనే డిమాండ్‌తో దేశ వ్యాప్తంగా మే 20న నిర్వహించనున్న జాతీయ సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సీహెచ్. నర్సింగరావు పిలుపునిచ్చారు. ఆదివారం స్టీల్ సీఐటీయూ కార్యాలయంలో జరిగిన ఉత్తరాంధ్ర జిల్లాల నాయకత్వ నిర్మాణ వర్క్ షాప్‌లో ఆయన ప్రసంగించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అదానీ, అంబానీలకు దేశ సంపదను దోచిపెడుతూ కార్పొరేట్ అనుకూల విధానాలు అవలంబిస్తూ కార్మిక, కర్షకులకు ద్రోహం చేస్తుందని అన్నారు. కార్మికులను ఆధునిక బానిసలుగా మార్చే విధంగా కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లు తెచ్చిందన్నారు. ప్రజల త్యాగాలతో నిర్మించిన సీల్‌ప్లాంట్, ప్రభుత్వ రంగ పరిశ్రమలు, రైల్వేలు, బ్యాంకులు, ఎల్‌ఐసీ, రక్షణ రంగం, గనులు, ప్రకృతి వనరులు ఇలా దేశ ఆర్థిక మూలాలను కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు ప్రైవేటీకరణను వేగవంతంగా అమలు చేస్తోందన్నారు. వర్క్‌షాప్‌లో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.ఎం. శ్రీనివాస్, ఆర్.కె.ఎస్.వి. కుమార్, వివిధ జిల్లాల నాయకులు సీహెచ్. అమ్మన్ననాయుడు, పి. తేజేశ్వరరావు, డి. రమణారావు, టి.వి. రమణ, ఆర్. శంకరరావు తదితరులు పాల్గొన్నారు.